ఇలా అయితే ఎలా?

- పర్యావరణ పరిరక్షణ ఒకవైపు.. చెట్ల తొలగింపు మరోవైపు
- అగమ్యగోచరంగా జీవీఎంసీ తీరు
- నిరసన వ్యక్తం చేస్తున్న మేధావులు, పర్యావరణవేత్తలు



మొక్కలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



పొక్లెయిన్‌తో చెట్లు తొలగిస్తూ..

గాజువాక: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి.. ప్లాస్టిక్ నిషేధించాలంటూ ప్రచారం చేసే జీవీఎంసీ అధికారులు ఉన్న చెట్లను తొలగిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంక్రీట్ జంగిల్‌గా ఖ్యాతి గాంచిన గాజువాకలో సరైన పార్కులు కాని, మొక్కలు నాటే ప్రాంతాలు కాని లేవన్నది అందరికీ తెలిసిందే. గాజువాక నడిబొడ్డులో తయారైన సెలెస్టా గేటెడ్ కమ్యూనిటీలో పచ్చదనం, పర్యావరణం కోసం అనేక మొక్కలు నాటారు. అయితే ఏం జరిగిందో తెలియదు గాని ఇటీవల ఆ గేటెడ్ కమ్యూనిటీ ప్రహరీని తొలగించిన జీవీఎంసీ సిబ్బంది ఇప్పుడు అక్కడ ఉన్న చెట్లను కూడా తొలగించడం ప్రారంభించారు. ప్రహరీని తొలగించినప్పుడు స్థానికులు జీవీఎంసీ సిబ్బంది తీరుకు నిరసన వ్యక్తం చేశారు. పచ్చని చెట్లను కూడా తొలగించడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నగరంలో పర్యావరణానికి తూట్లు పడుతోందని మేధావులు ఆందోళన చెందుతుంటే ఇలా ఉన్న చెట్లను తొలగించేస్తే వర్షాలు ఎలా పడతాయంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనికి జీవీఎంసీ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

క్లుప్తంగా

గడప గడపలో సంక్షేమ ఫలాలు



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: గడప గడపకు సంక్షేమ పథకాల ఫలాలు చేరువయ్యాయని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 73వ వార్డు సనత్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ లబ్ధిదారులకు ఎమ్మెల్యే బ్రోచర్లు అందించారు. నియోజకవర్గంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న హౌస్ కమిటీ, గాజువాక భూ వివాద సమస్య, అగనంపూడి కర్ణవాని పాలెం సమస్యలు పరిష్కరించడంలో ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడుతుందని, మరోసారి జగనన్నను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి సహకారం అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, గొరుసు సత్యనారాయణ రెడ్డి, వార్డు కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు రామకృష్ణరాజు, ఆలీ, కేకే నాయుడు, చీకటి కమల్, ప్రసన్న, పవన్‌కుమార్, సందీప్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఐక్యతకు పీవీ రావు కృషి శ్లాఘనీయం



స్టీల్‌ప్లాంట్‌లో పీవీ రావుకు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

ఉక్కునగరం: దళితుల ఐక్యతకు మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు చేసిన కృషి శ్లాఘనీయమని స్టీల్‌ప్లాంట్ దళిత నాయకులు కొనియాడారు. పీవీ రావు 74వ జయంతి సందర్భంగా బుధవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మాల, మాదిగల మధ్య వర్గీకరణ చిచ్చురేపిన ఆధిపత్య కులాల కుట్రను తిప్పికొట్టిన నాయకుడు పీవీ రావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వైటీ దాస్, డి. సురేష్‌బాబు, కారు రమణ, డి.పుల్లారావు, పరంధామయ్య, కృష్ణారావు, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి మందుల చీటీ పుస్తకాల అందజేత



డాక్టర్ రమేష్‌బాబుకు మందుల చీటీ పుస్తకాలు అందజేస్తున్న కేఎన్ఆర్

పెదగంట్యాడ: కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో బూస్టర్ డోస్‌లు సిద్ధం చేయాలని భారతీయ జనతా పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. ఈ మేరకు పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబుకు మందులు రాసే చీటీ పుస్తకాలను బుధవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో జీలకర్ర భువనేశ్వరి, సుజాత, రాజశేఖర్ పాల్గొన్నారు.

18 నుంచి చీరల వేలం

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి భక్తులు సమర్పించిన చీరలు వేలం వేయనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 21వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేలం కార్యక్రమం ఉంటుందని, భక్తులు అమ్మవారి చీరల వేలంలో పాల్గొనగలరని కోరారు.

మహాయజ్ఞానికి ఆహ్వానం



ఎమ్మెల్యే నాగిరెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న దేవదాయ శాఖ ఈవో జగన్నాథం

పెదగంట్యాడ: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం చేయనున్నారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. బీసీ రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 12 నుంచి 17 వరకూ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేకు గాజువాక దేవదాయ శాఖ ఈవో జగన్నాథం ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, లోకనాథం, ఇరోతి గణేష్, పిట్టా రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలి



818వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మకపు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 818వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ట్రాఫిక్ విభాగం కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ ప్రజల ఆస్తిని కార్పొరేట్ సంస్థలకు అమ్మడం అంటే తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడమే అవుతుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

16న ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

ఉక్కునగరం: ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నారు. బుధవారం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్టీల్‌ప్లాంట్ కార్మికుల వేతన ఒప్పందం అమలు ఏకైక అజెండాగా ఈ మేరకు తీర్మానించారు. సెయిల్‌లో 2021 డిశంబర్ నుంచి అమలు చేసినప్పటికీ విశాఖ ఉక్కులో అమలు చేయకపోవడం పట్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు ముట్టడి కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, జె. అయోధ్యరామ్, యు. రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువ నిర్మాణ పనుల పరిశీలన



రోడ్లు, కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని సంజీవ కాలనీలో చేపట్టిన రోడ్లు, కాలువ నిర్మాణ పనులను ఆ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు జీవీఎంసీ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఇళ్లలోని వాడుకనీరు రోడ్లపైకి రాకుండా చూడాలని, అలాగే చెత్తా చెదారాన్ని రోడ్లు, కాలువల్లో వేయవద్దని కోరారు. దీర్ఘకాలిక సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ సుబ్బారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, నాయకులు పెద్దింటి మంగునాయుడు, అడిగర్ల రమణ, చినబాబు, స్వాతి, గౌరినాయుడు, రమ పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

పెదగంట్యాడ : హిందూజా నేషనల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన యాష్ పాండ్ నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ స్పష్టం చేశారు. యాష్‌పాండ్ నుంచి వచ్చే ధూళి కారణంగా గాలి, నీరు కలుషితం అవుతున్నాయని జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని నక్కవానిపాలెం గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గత నెల 12న ఆర్డీవో పర్యటించారు. అప్పుడు భూగర్భ జల శాఖాధికారులు నీటి శాంపిళ్లను సేకరించి నివేదిక సిద్ధం చేశారు. ఆ నివేదికను బుధవారం ఆయన గ్రామస్తులకు వివరించారు. అయితే అది వాస్తవాలకు విరుద్ధంగా ఉందని గ్రామస్తులు చెప్పడంతో మరోమారు పరీక్షలు చేయాలని ఆర్డీవో తెలిపారు. యాష్‌పాండ్ నుంచి దుమ్ము ధూళి ఎగరకుండా ఉండేలా వాటర్ గన్స్ ఏర్పాటు చేసి నీటిని జల్లేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకటేశ్వరరావు, భూగర్భ జల వనరుల శాఖ ఏడీ శోభారాణి, వెటర్నరీ అసిస్టెంట్ సురేష్, వ్యవసాయ శాఖాధికారి శశికళ, తహసీల్దార్ రమాదేవి ఉన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ ఆలయంలో అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ఈవో రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారిని పూజించారు. ఉదయం గణపతి పూజ, అమ్మవారికి భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. పంచామృతాభిషేకం అనంతరం విశేష పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారిని పసుపుతో అలంకరించి, హారతులిచ్చారు. అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కో-ఆపరేటివ్ స్టోర్స్ నూతన శాఖ ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కో-ఆపరేటివ్ స్టోర్స్ నూతన శాఖను గొర్లెవానిపాలెంలో గురువారం ప్రారంభించనున్నారు. దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం, పోర్టికో కాలనీ, జాజులవాని పాలెం, గొతులచ్చన్న, పరవాడ ప్రాంతాలకు చెందిన ఉక్కు ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు ఈ శాఖను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 10 గంటలకు స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా శాఖను ప్రారంభించనున్నారని కోపరేటివ్ స్టోర్స్ పాలకవర్గం తెలిపింది.

పిన్‌కోడ్ అందుబాటులోకి తీసుకురావాలి

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకలో ఏర్పాటు చేసిన సబ్ పోస్టాఫీస్‌కు పిన్‌కోడ్ కేటాయించి ఏడేళ్లు కావస్తున్నా నేటికీ అమల్లోకి రాకపోవడంతో బుధవారం అగనంపూడి పోస్టాఫీస్ వద్ద స్థానిక ప్రజా సంఘాల నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తోకాడ రామారావు, విందుల వరహాలు, బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 2014లో బ్రాంచ్ పోస్టాఫీస్‌ను అప్‌గ్రేడ్ చేసి సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేశారని, అప్పట్లోనే పిన్ కోడ్ నంబర్‌గా 530053 కేటాయించారని తెలిపారు. అయితే నేటికీ అది అమల్లోకి రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పోస్ట్ మాస్టర్ రామలింగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సింగిడి సింహాచలం, తలారి శ్రీనివాసరావు, విందుల నరసింగరావు, ఆడారి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులూ.. అపోహలొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్

గాజువాక : ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించి హజ్ యాత్రకు వెళ్తారని, దీనిని కూడా ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు రాజకీయం చేయడం తగదని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు, 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. హజ్ యాత్రపై అపోహలొద్దని సూచించారు. ఆయన తన కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. హజ్ యాత్రికులపై ఎటువంటి ప్రయాణ భారం మోపలేదని స్పష్టం చేశారు. అదనపు భారం ఉంటే దానిని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఉదయశ్రీకి డాక్టరేట్ ప్రదానం



ఉదయశ్రీ ఆదిరెడ్డికి డాక్టరేట్ అందిస్తున్న ఫారన్ స్టడీస్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం : కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన ప్రముఖ బ్యూటీ థెరపిస్ట్ ఉదయశ్రీ ఆదిరెడ్డిని డాక్టరేట్ వరించింది. సౌత్ కొరియాకు చెందిన భూషన్ క్రిస్టియన్ యూనివర్సిటీ ఫర్ ఫారన్ స్టడీస్ ఈ గౌరవ డాక్టరేట్‌ను ఆమెకు అందజేశారు. గత పది సంవత్సరాలుగా ఉదయాస్ బ్యూటీ పార్లర్ నిర్వహిస్తూ ఆంధ్ర బ్యూటీ థెరపిస్ట్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా సేవలందిస్తున్న ఉదయశ్రీ చిన్ననాటి నుండి ఆధ్యాత్మిక భావాలు కలిగి సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్నారు. ఆమె సేవలకు మెచ్చిన భూషన్ క్రిస్టియన్ యూనివర్సిటీ ఫర్ ఫారన్ స్టడీస్ వారు సౌత్ కొరియాలో ఈ గౌరవ డాక్టరేట్‌ను కాస్మొటాలజీ విభాగంలో ఆమెకు అందజేశారు.

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రత్యేక స్పందన



ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీభాయి తదితరులు

పెదగంట్యాడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేకంగా స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, అయితే నగరానికి దూరంగా ఉండే మండలాలకు చెందిన ప్రజలు అక్కడికి వెళ్లడం భారంగా మారిందని చెప్పారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల ఆదేశానుసారం నెలలో రెండు సార్లు మండలాల్లో ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు రచించామన్నారు. అందులో భాగంగానే ఇక్కడ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. వ్యక్తిగత వివాదాలు, కుటుంబ సమస్యలు, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకు సమయం పడుతుందన్నారు. చిన్న చిన్న సమస్యలను మాత్రం 24 గంటల్లోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బుధవారం నిర్వహించిన ఈ స్పందనకు ఐదుగురు అర్జీలను అందజేశారు. తన మేనత్తకు చెందిన ఆర్ నెంబర్‌ను తమ కుటుంబానికి సంబంధం లేని వ్యక్తి తప్పుడు పత్రాలతో కాజేశారని, ఉద్యోగం కూడా పొందారని నెల్లిముక్కుకు చెందిన నీలాపు మహేశ్వరరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఆర్ నెంబర్ ప్లాట్‌ను కూడా కొట్టేయాలని చూస్తున్నారని విన్నవించారు. స్పందించిన ఆర్డీవో వెంటనే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వెంటనే ఆ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన తమకు రైస్ కార్డు మంజూరు చేయాలని పలువురు విన్నవించారు. తమకు నెలకు రూ.3 వేల వరకూ మాత్రమే పెన్షన్ వస్తుందని చెప్పడంతో పరిశీలించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని సీతానగరంలో ఓ వ్యక్తి కాలువను ఆక్రమించి షెడ్లు నిర్మించాడని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఆర్డీవో వెంటనే ఆ నిర్మాణాన్ని 24 గంటల్లో తొలగించాలని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం టీపీవో రేవతిని ఆదేశించారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పలువురు ఒంటరి మహిళలకు పెన్షన్లు ఆపేశారని, సచివాలయంలో సంప్రదిస్తే భర్త మిస్ అయినట్టు సర్టిఫికెట్లు తీసుకురావాలని చెబుతున్నారని ఆ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ఆర్డీవోకు వివరించారు. స్పందించిన ఆర్డీవో ప్రభుత్వ నిబంధనల మేరకు పెన్షన్ ఆపేశారని, సంబంధిత సర్టిఫికెట్లు ఉంటే పెన్షన్లు పునరుద్ధరిస్తామన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

పెదగంట్యాడ, గాజువాక మండలాల్లో ఇటీవల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటికి అడ్డుకట్ట వేయడంతో పాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల తహసీల్దార్ కె.రమాదేవి, జీవీఎంసీ సూపరింటెండెంట్, ఏపీఈపీడీసీఎల్ ఏఈ భానుప్రకాష్, అగ్నిమాపక, న్యూపోర్టు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



సురక్షితంగా బయటపడ్డ చిన్నారి పరిమళ



ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన రుత్తల లక్ష్మి

అక్కిరెడ్డిపాలెం: మల్కాపురం రామకృష్ణాపురానికి చెందిన రుత్తల లక్ష్మి (47) ఆమె బంధువైన యువకుడు ఎల్.రాజు స్కూటీ డ్రైవ్ చేస్తుండగా పరిమళ (8) చిన్నారితో కలిసి సబ్బవరం మామిళ్లవానిపాలెంలో ఒక వివాహానికి వెళ్తున్నారు. వీరు హోండా స్కూటీపై బుధవారం తెల్లవారు జామున బీహెచ్‌పీవీ సిగ్నల్ పాయింట్ నుంచి షీలానగర్ వైపు మలుపు తిరుగుతున్నారు. ఇదే సమయంలో ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి షీలానగర్ వైపు వస్తున్న కంటైనర్ లారీ ద్విచక్ర వాహనానికి తగిలింది. దీంతో వాహనం అదుపు తప్పి వెనుక కూర్చున్న లక్ష్మికి పొట్ట, ఎడమ తొడ, నడుము వద్ద తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను షీలానగర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో చిన్నారి పరిమళ, యువకుడు రాజు సురక్షితంగా బయటపడ్డారు. గాజువాక పోలీసులు కంటైనర్ లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు. అదే విధంగా ఎయిర్ పోర్టు దాటిన వెంటనే ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వాహనంతో పాటు జారి పడ్డారు. వీరి వెనుక వస్తున్న వ్యాను సడన్ బ్రేక్ వేయడంతో వ్యాను వెనుక వచ్చిన బొలేరో వ్యానును ఢీకొట్టింది. పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో ఎవరికి వారే స్వచ్ఛందంగా వెళ్లిపోయారు.

నిర్వాసిత రైతులకు స్థలాలు కేటాయించాలి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గాజువాక : ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన చినగంట్యాడ రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని ఆ గ్రామ నిర్వాసిత రైతులు కోరారు. ఈ మేరకు 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు ఆధ్వర్యంలో రైతులు మంత్రి అమర్‌నాథ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో రైతులకు స్థలాలు కేటాయించడం కోసం ప్రస్తుతం సర్వే నిర్వహిస్తున్నారని, ఆ జాబితాలో చినగంట్యాడ రైతుల పేర్లు లేవని పేర్కొన్నారు. దీనిపై స్పందించి భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గ్రామ, రైతు నాయకులు కుంచా వీరినాయుడు, కుంచా ఈశ్వరరావు, బొబ్బిలి పైడిరాజు, సిరసపల్లి వరాహ నర్సింగరావు, సిరసపల్లి సత్యారావు, విరోతి వరహాలశెట్టి, సిరసపల్లి గురువు నాయుడు, కుంచా నాయుడు తదితరులున్నారు.

వివేకానందుని బోధనలు అనుసరణీయం



విద్యార్థులకు కథలు చెబుతున్న సురేష్ మాస్టార్

పెదగంట్యాడ: వివేకానందుని బోధనలు అనుసరణీయమని ఉపాధ్యాయుడు సురేష్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు వివేకానందుని జీవిత చరిత్రను వివరించారు. అలాగే వారికి కథలు చెప్పారు. గ్రంథాలను చదివించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ రమణ పాల్గొన్నారు.

సీజీఆర్ఎఫ్‌తో విద్యుత్ వినియోగదారులకు న్యాయం



విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి కన్స్యూమర్స్ గ్రీవెన్స్ రీడ్రసల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ద్వారం న్యాయం పొందవచ్చని సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. ఆటోనగర్ ఐలా భవనంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ వ్యవస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌లో విద్యుత్ సమస్యలపై ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను పారిశ్రామికవేత్తలు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. జోన్ - 2 ఈఈ బీకే నాయుడు మాట్లాడుతూ ఆటోనగర్ విద్యుత్ పనులకు రూ.1.6 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఏ-బ్లాక్‌లో నివాసిత ప్రాంతాలకు, పరిశ్రమలకు ఒకే విద్యుత్ లైన్లు కొనసాగుతుండటంతో పరిశ్రమలకు ఏర్పడుతున్న ఇబ్బందులపై పారిశ్రామికవేత్త నాగిరెడ్డి తెలిపారు. విద్యుత్ వైర్లకు అంతరాయం అంటూ చెట్లను నరికివేస్తున్నారని పారిశ్రామికవేత్త పాండురంగ ప్రసాద్ తెలిపారు. చైర్మన్ జస్టిస్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను టోల్ ఫ్రీ నంబర్ 1912కి ఫిర్యాదు చేయవచ్చన్నారు. పరిష్కారం కాని ఎడల సీజీఆర్ఎఫ్‌కు వ్యక్తిగతంగా గానీ, తపాల ద్వారా గానీ, ఆర్‌లైన్ ద్వారా, ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్, మెంబర్ ఆఫ్ టెక్నికల్ పి.శ్రీనివాస్, ఆర్.సురేంద్రకుమార్, గాజువాక డిప్యూటీ ఈఈ సీహెచ్ మీనకేతనరావు, ఆటోనగర్ ఈఈ ఏ.పార్థసారథి, ఏఈలు ఎం.భీమరాజు పాల్గొన్నారు.